ముంపు వరిలో మెలకువలు పాటించాలి

- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి
- ముంపు లాగక ఆందోళనలో రైతులు

పెనుమంట్ర/పెనుగొండ: ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వరి పంట ఊడ్చిన దశ నుంచి పిలకల దశలో నీట ముంపునకు గురైంది. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటీయూ 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి. పంట ఊడ్చిన వెంటనే నీట మునిగి మొక్కలు చనిపోయిన ఎడల మనేదలు వేసుకోవాలి. ఆచంట మండలంలోని ఆచంట, పెనుమంచిలి, ఆచంట వేమవరం గ్రామాలలో ముంపుకు గురైన వరి పంట చేలను సహాయ వ్యవసాయ సంచాలకులు పాలకొల్లు డాక్టర్ పి.మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు, మండల తహసీల్దార్ జి.కనకరాజు పరిశీలించారు. నీటి ముంపుకు వరిలో తీసుకోవలసిన మెళకువలు ఏడీఏ రైతులకు వివరించారు.

నారుమడి లేదా ఎద పద్ధతిలో జల్లిన వరి మునిగితే..



మునిగిన వరిచేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నారుమడిలో విత్తనం చల్లిన వెంటనే మూడు కన్నా ఎక్కువ సార్లు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. వీలైనంత త్వరగా మడిలో నుంచి నీరు బయటకు తీసి వేసి పొలం ఆరగట్టాలి. నారుమడి పూర్తిగా దెబ్బతిన్న ఎడల అందుబాటులో ఉన్న స్వల్పకాలిక రకాలతో మరలా తిరిగి విత్తుకోవాలి. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది. కనుక నీట మునిగిన నారుమడి నుంచి వీలైనంత తొందరగా నీటిని బయటకు తీసి వేసి, తరువాత 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలి. ఈ వాతావరణంలో ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజమ్ లేదా రెండు గ్రాముల కార్బెండిజమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

పిలకల దశలో మునిగితే



పిలకల దశలో సాధారణ రకాలు 5 రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి. అదే ముంపును తట్టుకునే ఎంటీయూ 1064, పీఎల్ఏ 1100 వంటి రకాలు వారం రోజుల వరకు మునక తట్టుకుంటాయి. అలాగే ఆకులు పైకి కనిపిస్తూ 30–40 సెంటీమీటర్ల నీరు నిలబడే పల్లపు ప్రాంతాల్లో మధ్యస్థ ముంపుని కూడా తట్టుకుంటాయి. అదే ఎంటీయూ 1232 రకం అయితే 10–12 రోజుల పాటు తాత్కాలిక ముంపును కూడా తట్టుకుంటుంది. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10–15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలి.

– డాక్టర్ టి.శ్రీనివాస్, వ్యవసాయ పరిశోధన సహాయ సంచాలకులు, మారుటేరు

బార్ లైసెన్సులకు దరఖాస్తుల స్వీకరణ



మద్దాల శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ

పాలకొల్లు సెంట్రల్: నూతన బార్ పాలసీ మూడు సంవత్సరాలకు లైసెన్సులు పొందుటకుగాను ఓపెన్ కేటగిరిలో ఆరు బార్లకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఒక్కో అప్లికేషన్‌కు రూ.5 లక్షలు దరఖాస్తు రుసుము, రూ.10 వేలు అప్లికేషన్ రుసుము చెల్లించాలన్నారు. డ్రాలో బార్ దక్కించుకున్న వారికి ఓపెన్ కేటగిరి బార్‌కి సంవత్సరం రుసుముగా రూ.55 లక్షలు నిర్ణయించినట్లు తెలిపారు. నూతన పాలసీ విధానం ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ బార్లకు టైమింగ్ నిర్ణయించబడిందని తెలిపారు. బార్ లైసెన్స్ ఫీజులు ఆరు వాయిదాల్లో చెల్లించాలన్నారు. పాలకొల్లు అర్బన్ పరిధిలో గీత కులాల (గౌడ) వారికి ఒక బార్ రిజర్వ్ చేయబడినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ స్టేషన్ వద్ద తెలుసుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ లైన్‌మేన్‌గా వెంకట్రావు



అవార్డు అందుకున్న వెంకట్రావు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని పూలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా పని చేస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ నీతిపూడి వెంకట్రావు ఉత్తమ లైన్‌మెన్‌గా అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వెంకట్రావు ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పీ సాల్మన్‌రాజు చేతులమీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వెంకట్రావును అభినందించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

నరసాపురం రూరల్: రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం జక్కంపూడి నాగభూషణం నాయుడు, ఇతర సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించగా అధిక సంఖ్యలో రక్తదాతలు ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ రక్తం అవసరమై ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ సంస్థ ఇటువంటి క్యాంపులను నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యుడికి చెక్కు అందజేస్తున్న బుద్దరాజు

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్య బాధితుడికి వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. సోమవారం పోడూరు గ్రామానికి చెందిన ఆర్.నాగవెంకట రామకృష్ణకు కాలుకు గాయమై కాలును తొలగించారని అతడికి వైద్య ఖర్చుల నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు అందించిన రూ.10 వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించినట్లు ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు తెలిపారు.

సర్దార్ పాపన్న గౌడ్ జయంతి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం స్థానిక ఎలక్ట్రికల్ అసోసియేషన్ భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చినిమిల్లి బాబి, మేకా వరప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్స్ డేను నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కురిమెల్ల బాలకృష్ణ, కార్యదర్శి ఎ.జనార్ధనరావు, సంఘ సభ్యులచే స్థానిక తహసీల్దార్ సునీల్ కుమార్‌కు వృద్ధుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యవర్గ సభ్యులు బి.హరికుమార్, వైవీఎస్ మూర్తి, గాజుల మురళీకృష్ణ, పీవీ పాపారావు, సీహెచ్ సూర్యప్రకాశరావు, తమ్మిశెట్టి కనకరాజు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ప్రత్తి రామకృష్ణ, సంఘ కోశాధికారి ఎండీ ముస్తఫా, బీహెచ్ సత్యనారాయణ రాజు, యర్రా ఆంజనేయస్వామి, తదితరులు పాల్గొని వృద్ధుల సమస్యలపై నినాదాలు చేశారు.

25 ఎకరాల్లో వరి చేలు నీట మునక



నీట మునిగిన వరి చేలను పరిశీలించి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనుతో మాట్లాడుతున్న ఏవో నారాయణరావు

తాడేపల్లిగూడెం రూరల్: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలో 25 ఎకరాలు నీట మునిగాయని మండల వ్యవసాయాధికారి నారాయణరావు సోమవారం తెలిపారు. ఎల్.అగ్రహారం 10, కొత్తూరు, రెండు, దండగర్ర 8, కుంచనపల్లిలో ఐదెకరాల్లో పంట నీట మునిగిందన్నారు. కాగా, పడాల గ్రామంలో నీట మునిగిన వరి చేలను పరిశీలించినట్లు తెలిపారు. 10 కిలోల పొటాష్, 10 కిలోల యూరియా వేసుకుంటే మొక్కకు బలం చేకూరుతుందన్నారు.

తీరప్రాంతంలో నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి

నరసాపురం: తీర ప్రాంతం ప్రజలకు నాణ్యమైన విద్యను అందించాలని కేంద్ర భారీ ఉక్కు గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో గొన్నాబత్తుల వెంకట ప్రసాద్, నందిని విద్యారణ్య భారతీయ విద్యా కేంద్రం ఇంగ్లిష్ మీడియం సీబీఎస్ఈ సిలబస్ నూతన భవనం ప్రారంభ కార్యక్రమంలో మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యారణ్య ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి, వినాయక విగ్రహాలకు పూల మాలలు వేసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం 2.30 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 10 కోట్ల వ్యయంతో నిర్మించిన 30 తరగతి గదుల స్కూల్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ గొన్నబత్తుల వెంకట ప్రసాద్, నందిని దంపతులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు



జాతరలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామ దేవత దండు మారెమ్మ, పేట మారమ్మ అమ్మవార్ల జాతరను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఖండవల్లి వారిచే నిర్వహించిన జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ నెల 17న ప్రారంభమైన ఉత్సవాలు 21వ తేదీ వరకూ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ అర్చకులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తూర్పుతాళ్ల గ్రామ ప్రజలతో పాటు, పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

యలమంచిలి: మేడపాడు హైస్కూల్‌లో 2010–11 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఈ ఏడాది వేసవి సెలవుల్లో పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలో వారికి విద్యను బోధించిన ఉపాధ్యాయుడు పోలిశెట్టి క్రాంతికుమార్ సూచన మేరకు విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.20,000 సేకరించారు. ఆ నగదును క్రాంతికుమార్ సమక్షంలో ఆ బ్యాచ్ తరఫున ప్రస్తుతం ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన మద్దాల రాజేష్, అద్దాల బాబ్జి సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు, వారిని ప్రోత్సాహించిన క్రాంతి కుమార్‌కు పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులపై దాడులను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

పాలకొల్లు సెంట్రల్: 40 ఏళ్లలో కుటుంబం, సమాజం, దేశం కోసం ఎంతో శ్రమపడి వాటి అభివృద్ధి కృషి చేశామని అలాంటి మాకు జీవిత చరమాంకంలో అనేక వేధింపులు ఎదురవుతున్నాయని సీనియర్ సిటిజన్స్ పాలకొల్లు శాఖ కార్యదర్శి జీఎస్ఎన్ మూర్తి అన్నారు. సోమవారం సీనియర్ సిటిజన్స్ జాతీయ కోరికల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, పట్టణ పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ అనారోగ్యాలతో జీవిత చరమాంకంలో ముఖ్యంగా ఒంటరిగా ఉంటున్న వయో వృద్ధులపై రోజు రోజుకూ వేధింపులు, దోపిడీలు, మోసాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. పత్రికల్లో, మీడియాలో రోజు చూస్తున్నామని అన్నారు. అలాంటి వాటిని అరికట్టి ప్రాణ, మాన, ఆస్తి సంరణ కోసం వారి శేష జీవితం గౌరవంగా గడుపుటకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మార్గదర్శకాలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ట్రెజరర్ మాగంబాలకొండలరావు, యర్రంశెట్టి వెంకటరత్నం, కలిదిండి వెంకటపతి వర్మ, దాట్ల రామకృష్ణంరాజు, కారుమూరి లక్ష్మీనరసింహం, మాడభూషి కృష్ణప్రసాద్, రాయి సూరిబాబు, సలాది సత్యనారాయణ మూర్తి, పుత్సల నాగలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. గోతిలోనే



మూతలు లేకుండా బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: నరసాపురం బస్టాండ్ వద్ద డ్రెయిన్ ప్రమాదకరంగా మారింది. డ్రెయిన్‌పై మూతలు లేవు. నిత్యం వేలాది మంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. అలాంటి ఈ మార్గంలో పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కొంత కాలం క్రితం బస్టాండ్ పక్కనున్న డ్రెయిన్‌ను బాగుచేసి, మూతలు తీశారు. పని పూర్తయిన తరువాత, తిరిగి మూతలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. డ్రెయిన్‌పై మూతలు లేకపోవడంతో అనేక మంది, గోతుల్లో పడి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకుంటున్నారు. అసలే ఈ డ్రెయిన్ పూర్తిగా శిథిలమైంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

పెన్షన్ మార్చ్ ర్యాలీని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

నరసాపురం: పాత పెన్షన్ విధానం కోరుతూ ఏపీసీపీఎస్ఈఏ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన గుంటూరు నాగార్జున యూనివర్సిటీ నుంచి విజయవాడ వరకు చేసే పెన్షన్ మార్చ్ ర్యాలీని ఉద్యోగులు జయప్రదం చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం డెమొక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసెఫ్ కిషోర్, నరసాపురం మండల కమిటీ అధ్యక్షుడు పి.మదన్‌మోహన్ కోరారు. సోమవారం స్థానిక చలువ పేటలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షన్ ఉద్యోగి హక్కని, ప్రభుత్వాలు హామీలు ఇవ్వటమే కాదు వాటిని అమలు చేయాలని కోరారు. పెన్షన్ మార్చ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సీహెచ్ విజయ సుధ, ఎండీ షానూర్ ఖాన్, ఉదయ్‌కుమార్, ఎల్.ఏడుకొండలు, ఎం.బాలచంద్ర, ఎస్.అశోక్ రాయుడు, సీహెచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులు మెలకువలు పాటించాలి



ఈడూరులో ముంపులో ఉన్న వరిచేనును పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్

అత్తిలి: ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాలలో వరి పంట ఊడ్చిన దశ నుంచి పిలకలు దశలో నీట ముంపుకు గురికావడం జరిగిందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. సోమవారం ఆయన మండలంలో ముంపుకు గురైన పంటచేలను ఆయన పరిశీలించి రైతులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎం.టి.యు 1318, స్వర్ణ , సంపద స్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయన్నారు. పంట ఊడ్చిన వెంటనే నీట మునిగి మొక్కలు చనిపోయిన ఎడల మనేదలు వేసుకోవాలని చెప్పారు. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత్త త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 10 – 15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



ఇరగవరంలో జగనన్న కాలనీ ప్రక్క నుండి ఉధృతంగా ప్రవహిస్తున్న మురుగు డ్రెయిన్



ఇరగవరంలో నీట మునిగిన పంట పొలాలు

ఇరగవరం: అల్పపీడన ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకుఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుకుంది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో వరద నీటితో రోడ్లు చెరువులను తలపించాయి. మండలంలో ఇరగవరం, అర్జునుడుపాలెం, గోటేరు, రేలంగి, కత్త పాడు, కాకిలేరు, కొయ్యేటిపాడు, ఏలేటిపాడు, అయిన పర్రు, తూర్పు విప్పర్రు, కెకుముదవల్లి, ఆర్ ఖండ్రిక , కావలిపురం గ్రామాల్లో పెద్ద ఎత్తున పొలాలు నీట మునిగాయి. మరో పక్క గ్రామాల్లోని మురుగునీరు రోడ్ల మీద ప్రవహిస్తుండగా డ్రెయినేజీల్లో మురుగు సరిగా లాగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 5వేల ఎకరాల వరకు పంట నీటిలోనే ఉంది.

ఎల్.అగ్రహారంలో లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ట



పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని లక్ష్మీపురం అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, ఆలయ కమిటి మైల వరపు సత్యనారాయ ణ, బసిరెడ్డి శ్రీనివాస్, ఇనుకుర్తి రమేష్, నాగాబత్తుల సుబ్రహ్మణ్యం, మంచాల శివయ్య, దారపురెడ్డి పాండురంగ, పరిమి రవికుమార్ పాల్గొన్నారు.

నూతన బార్ పాలసీ గెజిట్ నోటిఫికేషన్ జారీ

తణుకు అర్బన్: నూతన బార్ పాలసీ విధానానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తణుకు ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 6 బార్లకుగాను ఈనెల 26వ తేదీ లోపు దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అందచేయవచ్చని అన్నారు. తణుకు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. లైసెన్స్ ఫీజు మొదటి ఏడాది రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ. 55 లక్షలు చెల్లించాలని ఏడాదికి పది శాతం పెంచి మరో రెండేళ్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో లాటరీ ప్రక్రియ ద్వారా ఈనెల 28న బార్‌లను ఎంపిక చేస్తారని చెప్పారు. ప్రతి దరఖాస్తుకు రూ. 5 లక్షలు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజుగాను, రూ. 10వేలు నాన్ రీఫండబుల్ ప్రాసెసింగ్ ఫీజుగా నిర్దేశించినట్లు వివరించారు. ఈ మేరకు వివరాలను సీఐ వెల్లడించారు.

ముంపులోనే పంట పొలాలు



పాలకొల్లు సెంట్రల్: నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ దుర్గాకిషోర్, వ్యవసాయ శాఖ ఏడీఏ మురళీకృష్ణ



యలమంచిలి: మండలంలోని చించినాడలో నీటమునిగిన వరి చేలు

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని వరి పంటలు నీట మునిగాయి. రైతులు ఇటీవల ఊడ్పు లు మొదలు పెట్టారు. అవి పిలకల దశలో ఉండగా ముంపుకు గురయ్యాయి. సోమ వారం మండలంలో శివదేవుని చిక్కాల గ్రామంలో నీట మునిగిన పొలాలను తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, వ్యవసాయ శాఖ ఏడీఏ మురళీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ పాలకొల్లు మండలంలో 108 ఎకరాలు, పోడూరు మండలంలో 60 ఎకరాలు, ఆచంట మండలంలో 1010 ఎకరాలు యలమంచిలి మండలంలో 13 ఎకరాలు నీట మునిగినట్లు వెల్లడించారు. నారుమడిలో విత్తనం చల్లిన వెంటనే మూడు కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు. వీలైనంత త్వరగా మడిలో నీటిని బయటకు తరలించి పొలం ఆరబెట్టాలన్నారు. నారుమడి పూర్తిగా దెబ్బతింటే అందుబాటులో ఉన్న స్వల్పకాలిక రకాలతో మళ్లీ తిరిగి విత్తుకోవాలన్నారు. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంచటుకోవడానికి వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్‌ను అదనంగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో రాజశేఖర్, వీఆర్వో నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

అధిక వర్షాలకు నీటమునిగిన వరి చేలు

యలమంచిలి: గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు కాజ డ్రెయిన్‌లో నీరు ఉప్పొంగడంతో చించినాడ బైపాస్ రోడ్డులో ఉన్న వరిచేలు నీట మునిగాయి. అయితే సోమవారం వర్షం రాకపోవడంతో డ్రెయిన్‌లో నీరు తగ్గుముఖం పట్టింది. ముంపునకు గురైన వరి పంటలో నీరు బయటకు తీసిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను బూస్టర్ డోస్‌గా వేయాలని మండల వ్యవసాయాధికారి బాలాత్రిపుర సుందరి కోరారు.